క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల పెద అవుటపల్లికి చెందిన వైద్య బృందం గుండె, నరాలు, కాలేయం, ఎముకలు తదితర వైద్యవిభాగాలకు చెందిన నిపుణులు 55 మందికి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, డాక్టర్ తరుణ్ సాయి, డాక్టర్ హంసిని, డాక్టర్ నిఖిత, డాక్టర్ అఖిల, రోటరీక్లబ్ అధ్యక్షుడు టిఎస్ రాజశేఖర్, కార్యదర్శి కిరణ్‌బాబు, జి. సురేష్, ఎ. సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎ.సూర్యచంద్రరావు, ఎస్. ఉదయ్ భాస్కరరాజు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: తీవ్రమైన ఎండల్లో సైతం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం తరలిరావడంతో సందడిగా మారింది. అమ్మవారికి పండ్లు, టెంకాయలను సమర్పించిన భక్తులు పాల పొంగళ్లను పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు. అలాగే మజ్జిగ పంపిణీని భక్తులకు చేపట్టారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ



జుఝువరం(పామర్రు): గ్రామంలో దృష్టిదోషం ఉన్న వారికి దాత సహకారంతో ఆదివారం ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. గ్రామంలో గత నెల 29వ తేదీన విజయవాడకు చెందిన కామినేని హాస్పిటల్స్ వారు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జోగి వెంకట రాజేష్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు గంటలయ్య, అమ్మిలేశ్వరమ్మ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 115 మందికి కళ్ల జోళ్లు అవసరమని కంటి వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో 115 మందికి కళ్ల జోళ్లను అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు శోభన్‌బాబు, రామ్‌ప్రసాద్, నాగ మురళి, మురాల కొండలు, వీరంకి పోతురాజు, చైతన్య పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



యద్దనపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు పెట్రేగిపోతున్నాయి. మండలంలోని యద్దనపూడి గ్రామంలోని మెట్ట పొలాల్లో మట్టి తవ్వకాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు సుమారు ఏడు ఎకరాల పొలంలో మట్టిని తవ్వేందుకు పనులు ప్రారంభించారు. దీనిపై మొవ్వ తహసీల్దార్‌ను వివరణ కోరగా మూడు ఎకరాల్లో మట్టిని తవ్వేందుకు అనుమతులు కోరుతూ దరఖాస్తు చేశారని తెలిపారు. వాటిని ఉన్నతాధికారుల పంపినట్లు పేర్కొన్నారు. అయితే ఆదివారం వరకు ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

రహదారుల సర్వే నిర్వహించండి



మండవల్లి: మండవల్లిలోని కొన్ని రహదారులు ఆక్రమణతో కుచించుకు పోతున్నాయి. ఈ రహదారుల సర్వే నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. స్థానిక కైకలూరు వీధి, శివాలయం వీధులు ఆక్రమణల కారణంగా వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. సెంటర్ నుంచి మూడుతాళ్లపాడు మీదుగా ఇంగిలిపాకలంక వరకు ఆర్అండ్‌బీ రహదారి ఆక్రమణలతో కుచించుకుపోయిందని తెలిపారు. ఇప్పటికైనా సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

బడాబాబుల చెరలో వైవాక కాలువ

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన న్యూ వైవాక చానల్ బడాబాబుల చెరలో చిక్కుకు పోయింది. చానల్ ఆయకట్టు పరిధిలోని భూములన్నింటికీ సాగునీరు అందించాల్సి ఉండగా కొందరు బడా రైతులకు మాత్రమే పరిమితం కావడంతో ఇతరులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. కాలువపై సరైన అజమాయిషీ లేకపోవడంతో బడా బాబుల ఆగడాలకు అంతులేకుండా పోయింది.

అడ్డగోలుగా తవ్వకం

మండలంలో ప్రధానమైన క్యాంపుబెల్ కాలువ నుంచి న్యూ వైవాక చానల్ ప్రారంభమవుతుంది. ఈ కాలువ పొడవు సుమారు ఎనిమిది కిలోమీటర్ల పైగా ఉంది. దీని ఆయకట్టులో 90 శాతం పైగా ఆక్వాసాగు జరుగుతోంది. ఈ సాగులో బడాబాబులు కీలకపాత్ర పోషిస్తున్నారు. కాలువ పూడుకుపోవడంతో చేపల చెరువులకు వేసవిలో సక్రమంగా నీరందదనే భయంతో కొందరు బడా రైతులు ఎలాంటి అనుమతులు లేకుండా దేవపూడి సైఫన్ నుంచి వైవాక సైఫన్ వరకు లోతుగా కాలువను తవ్వేశారు. దీంతో వైవాక సైఫన్ దిగువన ఉన్న చెరువులకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది.

అక్రమంగా తూములు ఏర్పాటు

ఈ కాలువకు వైవాక పరిధిలోని పెద్దపెద్ద చెరువులకు అక్రమంగా తూములు ఏర్పాటు చేసి నీటిని మళ్లించుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తూములు బయటకు కనిపించకుండా మట్టితో పూడ్చివేసి అవసరమైన సందర్భాలు, రాత్రి సమయాల్లో మాత్రమే మట్టిని తొలగించి నీటిని అక్రమంగా మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ అక్రమ తూముల ఏర్పాటుపై కొందరు రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారే తప్ప వీటిని తొలగించేందుకు వచ్చిన అధికారులకు ఎక్కడ తూములు ఉన్నాయో, వేటిని తొలగించాలో చెప్పేందుకు జంకుతున్నారు. దీంతో అధికారులు సైతం నిస్సహాయ పరిస్థితుల్లో అక్రమ తూములు తొలగించలేకపోతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

న్యూ వైవాక చానల్ పరిధిలో మండలంలోని దేవపూడి, వైవాక, ప్రొద్దువాక, కలిదిండి మండలంలోని ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాల పరిధిలోని భూములున్నాయి. వీటికి ఈ కాలువ ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. చివరి భూములకు సైతం సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ కాలువపై లస్కర్ లేకపోవడతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. కాలువ పరిధిలో ఏమి జరుగుతుందో అధికారులకు సమాచారమిచ్చే నాథుడే లేకుండాపోయాడు.



దేవపూడి-వైవాక సైఫన్ల మధ్య తవ్విన కాలువ



వైవాక సైఫన్ తర్వాత తవ్వకుండా వదలేసిన కాలువ

తూములు తొలగిస్తాం

చేపల చెరువులకు అక్రమంగా తూములు ఏర్పాటు చేసినట్లు పూర్తి ఆధారాలు చూపితే కచ్చితంగా తొలగిస్తాం. కాలువ పర్యవేక్షణకు వచ్చినప్పుడు రైతులు ఈ సమస్యను నా దృష్టికి తీసుకురాలేదు. అయినప్పటికీ రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– సిద్ధార్థ, ఏఈ, నీటి పారుదల శాఖ, వడాలి సెక్షన్

ఏకాగ్రతను పెంచేది ధ్యానం



ధ్యానం చేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: ఉద్యోగులు ఏకాగ్రతను పెంపొందించుకుంటే వారు పని ఒత్తిడి తగ్గించుకోగలుగుతారని డాక్టర్ ఎం.రవి అన్నారు. శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యానకేంద్రం గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం హాల్లో మున్సిపల్ ఉద్యోగులకు ఒక గంట ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ధ్యానం చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతామన్నారు. జీవితం ఆనందంగా కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగులు తమ విధుల నిర్వహణకు ముందు కొంత సమయం ధ్యానానికి కేటాయిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ పి. శ్రీనివాసరావు, ఏఓ తిరుపతి నాయుడు, ఏసీపీ ఏసుబాబు, ధ్యానకేంద్రం నిర్వాహకురాలు రాజకుమారి, గుత్తా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాదుకు సత్కారం

గుడివాడ టౌన్: క్రీడాకారునిగా జీవితాన్ని ప్రారంభించి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరి వందల మంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దిన మడకా ప్రసాదు క్రీడా స్ఫూర్తి అభినందనీయం అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాదు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఖో-ఖో అంటే గుడివాడ అనే గుర్తింపు తెచ్చిన కోచ్ మడకా ప్రసాద్ అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మడకా ప్రసాదును సత్కరించిన యలవర్తి తదితరులు

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



మొవ్వలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

పామర్రు: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక అధికారి ఎస్.రాంబాబు అన్నారు. ఈనెల 14వ తేదీన ప్రారంభించిన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తప్పిదాల వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇళ్లల్లో గ్యాస్ లీకై మంటలు చెలరేగినప్పుడు కార్బన్ డైఆక్సైడ్ సిలిండర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తరువాతే అగ్నిప్రమాదాన్ని నివారించే ప్రయత్నం చేయాలన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం అగ్నిమాపక కేంద్రంలో పోలీసులకు ప్రదర్శన నిర్వహించారు. అగ్నిప్రమాదాల నివారణకు వినియోగించే సామగ్రి, నివారణ విధానాలు, పలు పెను ప్రమాదాల నివారణకు సంబంధించిన ఫొటో ప్రదర్శన నిర్వహించారు. అకస్మాత్తుగా ఎలక్ట్రికల్ ఫైర్(షార్ట్ సర్క్యూట్) జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే ప్రయోగాలను నిర్వహించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ శివ నాగప్రసాద్, రూరల్ సీఐ సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు, పెదపారుపూడి, నందివాడ సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో ప్రదర్శన తిలకిస్తున్న పోలీసులు



పామర్రులో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి రాంబాబు

మొవ్వలో..

మొవ్వ: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఎస్సీ బాల బాలికల ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు, డ్వాక్రా మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్ర అధికారి వెంకటేశ్వరరావు, లీడింగ్ ఫైర్ మెన్స్ (ఇన్‌చార్జి) వెంగళరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



తోట్లవల్లూరులో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ చంద్రశేఖర్



మొవ్వలో కొవ్వొత్తులతో ఏసుకు స్వాగతం పలుకుతున్న విశ్వాసులు

పామర్రు: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పలు చర్చిలలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలోని సెయింట్ పాల్ చర్చిలో ఈస్టర్ పర్వదినం సందర్భంగా పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థలు చేశారు. సంఘస్తులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవము కల్గిన ఏకైక దేవుడు ఏసు క్రీస్తు అని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సమ్మంగి సత్యరూతు, కాకే ప్రసాద్, దోమతోటి గ్రేసమ్మ, గుమ్మడి సత్య, కాకొల్లు రాజ్యలక్ష్మి, నాంచరయ్య, సోలే కృపమ్మ, కంచర్ల షారోన్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: తనను నమ్ముకున్న విశ్వాసులను కాపాడుకునేందుకు శిలువ నుంచి ఏసుక్రీస్తు లేచి వచ్చారని స్థానిక ఆర్సీఎం చర్చి ఫాదర్ మ్యాథ్యూ అన్నారు. ఆదివారం ఈస్టర్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: ఏసుక్రీస్తు పునరుత్థాన దినం పురస్కరించుకుని మండల వ్యాప్తంగా చర్చిలలో క్రీస్తు విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తోట్లవల్లూరు మరనాత ప్రార్థన మందిరంలో పాస్టర్ వల్లూరు చంద్రశేఖర్ ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని పలు చర్చిల్లో శనివారం అర్ధరాత్రి ఈస్టర్ పండగ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఏసు క్రీస్తును శిలువ వేసిన మూడో రోజున క్రీస్తు తిరిగి లేచి రావటంతో వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో కొవ్వొత్తుల వెలుగులతో ఏసుక్రీస్తుకు స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొవ్వలోని ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ పులిపాక జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మండవల్లిలో..



పెదమద్దాలి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



మండవల్లిలో మాట్లాడుతున్న ఫాదర్ శాంతిరాజు

మండవల్లి: మండలంలోని అన్ని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండవల్లిలోని చర్చిల్లో ఏసు పునరుత్థాన పండుగను జరుపుకున్నారు. మండవల్లి ఆర్సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ శాంతిరాజు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే ప్రార్థనలు చేసి పాస్టర్లు సందేశాలిచ్చారు. కొరగుంటపాలెం ఇమ్మానుయేలు చర్చిలో పాస్టర్లు వి.విజయకుమార్, స్వర్ణన్‌రాజు, శ్రీహరిపురం కాలనీ పార్థనా మందిరంలో పాస్టర్ వి.ప్రభుదాస్, ముదినేపల్లి ఆర్సీఎం చర్చిలో పాస్టర్ మరియదాసు ఆధ్వర్యంలో ఈస్టర్ డే వేడుకలు జరిగాయి.

ప్రమాదకరంగా మర్రివాడ వంతెన

పమిడిముక్కల: మండలంలోని మర్రివాడ వంతెన ప్రమాదకరంగా మారింది. రైవస్ కాలువపై ఉన్న ఈ వంతెన ఇరువైపులా పగుళ్లిచ్చి పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. సైడ్ వాల్స్ కూడా దెబ్బతిన్నాయి. ప్రమాదకరంగా మారిన వంతెన ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా వంతెన ప్రమాదకరంగా మారిందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మర్రివాడ, యలమర్రు మీదగా గుడివాడకు దగ్గరి దారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు రహదారి పైనుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పేద విద్యార్థికి ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: ఆది వెలమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక పింఛన్‌ల ఆర్థిక సహాయాన్ని ఆ సంఘ నాయకులు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఆది వెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోకా సూర్యప్రకాశరావు, కార్యదర్శి సూరత్ శ్రీకాంత్ పంపిన రూ.70 వేల మొత్తాన్ని నగదు రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ మొత్తాలను స్థానిక ఆది వెలమ సంఘం మచిలీపట్నం శాఖ కార్యాలయం వద్ద మాజీ అధ్యక్షుడు పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు, పిళ్లారిశెట్టి సత్యనారాయణ, మరకాని వాసు, మాదిరెడ్డి ఈశ్వర్ తదితరులు లబ్ధిదారులకు అందజేశారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ముగిసిన వీర సుంకులమ్మ తల్లి జాతర

పెడన: మండల పరిధిలోని పుల్లపాడు గ్రామంలో జోగి ఇంటి పేరు వారి ఇలవేల్పు, గ్రామ దేవత వీర సుంకులమ్మ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత ఐదు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆదివారం చివరి రోజు జాతర మహోత్సవాలు ముగింపు ప్రక్రియను ఘనంగా నిర్వహించారు. జోగి వారితో పాటు ఇతర భక్తులు సైతం పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు జోగి సుబ్రహ్మణ్యం సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పెడన ఎస్ఐ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పుల్లపాడు వీర సుంకులమ్మ ఆలయం వద్ద నిర్వాహకులు, గ్రామపెద్దలు

ముగిసిన నాటిక పోటీలు



గుడివాడ టౌన్: కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో భాగంగా మూడు నాటికలు ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనగా రైల్వే ప్రయాణికులపై సంస్థ చూపుతున్న వివక్షను వివరిస్తూ జనరల్ బోగీలు నాటిక, రెండో ప్రదర్శనగా ఇది అతని సంతకం, మూడో ప్రదర్శనగా శిథిల జీవి నాటకాలు ప్రదర్శించారు.

పుచ్చకాయల పంపిణీ

చల్లపల్లి: స్థానిక పార్వతమ్మతోటలోని కోట వెంకటసుబ్బారావు ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు పుచ్చకాయలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన వేమూరి విజయ్, యామిని దంపతులు పుచ్చకాయలు, దోసకాయలను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు



స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కృత్తివెన్ను: సీతారామచంద్రులు, వేణుగోపాలకృష్ణస్వామివార్ల 17వ వార్షిక మహోత్సవం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు వేడుకగా ఈ ఉత్సవాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజలు సుదర్శన హోమం, శాంతి కల్యాణం మంగళవారం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.



స్వామి పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ముదినేపల్లి రూరల్: చేతివృత్తులతో మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు.



కుట్టు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని